సాక్షి కామారెడ్డి

బుధవారం ၊ 25 ၊ జూన్ ၊ 2025



రైతు భరోసా సంబురాలు

రైతు వేదికలలో మంగళవారం రైతు భరోసా సంబురాలు నిర్వహించారు. పలుచోట్ల సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

- 9లో ▸



బలోపేతం కావాలి

మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని అదనపు డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం

36.2 /23.5

వాతావరణం

ఉదయం చల్లని ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

'ప్రతి చిన్నారికి టీకాలు వేయాలి'



భిక్కనూరు: ప్రతి చిన్నారికి తప్పనిసరిగా క్రమం తప్పకుండా టీకాలను వేయాలని రాష్ట్ర ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం అధికారి అఖిల్ సూచించారు. మంగళవారం భిక్కనూరు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఎవరైనా చిన్నారులు టీకాలు తీసుకోవడంలో క్రమం తప్పితే వారిని గుర్తించి టీకాలు వేయాలని సూచించారు. దీనిపై తల్లిదండ్రులను అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలోని వ్యాక్సిన్ స్టోర్ రూమ్‌ను, వ్యాక్సిన్‌లను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా పరిశీలకులు శ్రీనివాస్, నగేష్, వైద్యురాలు యెమిమా, ఫార్మసిస్ట్ అధికారి స్వామి, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటరమణ, డాటా ఎంట్రీ అధికారి సిద్ధార్థ ఉన్నారు.

'ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి'



కామారెడ్డి అర్బన్: ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని టీఎన్జీవోస్ హాల్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ ప్రకటించాలని, పెండింగ్ డీఏలు, బిల్లులు మంజూరు చేయాలని, హెల్త్‌కార్డుల జారీ చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రమోషన్ పొంది మెదక్ జిల్లాకు బదిలీ అయిన సహకార శాఖ ఉద్యోగి సాయిలును సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ముల్కరాజు, అసోసియేట్ అధ్యక్షుడు చక్రధర్, కోశాధికారి దేవరాజు, ప్రతినిధులు లక్ష్మణ్, పోచయ్య, మహిపాల్, శరణ్, సృజన్‌రెడ్డి, రమేష్, అజీముద్దీన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

30న హైదరాబాద్‌లో యాదవుల ఆత్మగౌరవ సభ



కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈనెల 30న నిర్వహించే యాదవుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ, కులపాలన చేస్తూ యాదవులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇవ్వకపోవడం దారుణమన్నారు. యాదవులతోపాటు మున్నూరు కాపు, ఎంబీసీలకు కూడా మంత్రి పదవి ఇవ్వాలన్నారు. ఎన్నికలముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అర్కల ప్రభాకర్ యాదవ్, నాయకులు మల్లేశ్ యాదవ్, జగదీశ్ యాదవ్, కృష్ణ యాదవ్, వాసు యాదవ్, కొమరయ్య, రాజు, పవన్, కిరణ్, మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కేంద్రంలో ర్యాలీ

కామారెడ్డి క్రైం: మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం ఒక ప్రకటన ద్వారా కోరారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కల్పించడానికి గురువారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు సీఎస్ఐ చర్చి గ్రౌండ్ నుంచి కళాభారతి వరకు ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని, వాటితో కలిగే దుష్పరిణామాలపై అవగాహన పెంచే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రతి ఒక్కరూ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బస్‌డిపోపై సీఎంతో చర్చిస్తా

- పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం
- రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్రలతో మంత్రి పొన్నం మాటామంతి



బస్టాండ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కోరారని, ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఎల్లారెడ్డికి విచ్చేసిన మంత్రికి కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం ఎల్లారెడ్డిలో రూ. 5 కోట్లతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, విచారణ కేంద్రాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని రేషన్‌కార్డులపై సన్నబియ్యం పథకాన్ని తెలంగాణలో అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందని ద్రాక్షగానే మిగిలాయన్నారు. తాము ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నామన్నారు.

తొమ్మిది రోజులలో రూ. 9 వేల కోట్లు..

రైతు భరోసా నిధులను రైతుల ఖాతాలలో జమ చేశామని మంత్రి తెలిపారు. తొమ్మిది రోజులలో రూ.9 వేల కోట్లు అందించామన్నారు. 126 మహిళా సంఘాలకు మంజూరైన రూ. 10 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కును మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళా సంఘాలకు అందించారు.

పేదోడి ఎయిర్‌పోర్ట్..



ఎల్లారెడ్డిలో నిర్మించిన బస్టాండ్‌ను పేదోడి ఎయిర్‌పోర్టుగా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అభివర్ణించారు. ఎల్లారెడ్డి వెనకబడిన ప్రాంతమన్నారు. గత ప్రభుత్వంలో బస్టాండ్ నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయిందని, తాను రూ. 3.5 కోట్ల నిధులు మంజూరు చేయించి నిర్మాణాన్ని పూర్తి చేయించానని పేర్కొన్నారు. రూ. 40 లక్షలతో ఫ్లడ్‌లైట్లు, 200 ఫీట్ల సీసీ రోడ్డు వేయించామని తెలిపారు. రూ. 74 కోట్లతో నిర్మించే ఏటీసీ సెంటర్‌కు భూమిపూజ చేశామన్నారు. ఈ ప్రాంతవాసుల ఎన్నో ఏళ్ల కల అయిన బస్‌డిపోను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యేల లక్ష్మీకాంతారావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, డీఆర్‌డీవో సురేందర్, అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్, ఆర్డీవో వీణ, మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, ఏఎంసీ చైర్మన్ రజిత, మున్సిపల్ మాజీ చైర్మన్లు పద్మ శ్రీకాంత్, కుడుముల సత్యనారాయణ, నాయకులు ప్రశాంత్‌గౌడ్, సాయిబాబా, నారాగౌడ్, శ్రీధర్‌గౌడ్, వినోద్‌గౌడ్, లింగాగౌడ్ పాల్గొన్నారు.

రైతులకు మేలు చేస్తున్న ప్రభుత్వం..

రైతులకు మేలు చేస్తున్న ప్రభుత్వం తమదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మీసాన్‌పల్లి రైతువేదిక నుంచి రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.



రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే



ఎల్లారెడ్డి బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఆర్టీసీకి రూ. 6 వేల కోట్లు చెల్లించాం

రాష్ట్రంలో ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసినప్పటినుంచి ఇప్పటివరకు మహిళలు 190 కోట్ల సార్లు ఉచితంగా బస్సులలో ప్రయాణించారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకుగాను ప్రభుత్వం ఆర్టీసీకి రూ. 6,008 కోట్లు చెల్లించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఉంటుందా, మూసివేస్తారా అన్న పరిస్థితి ఉండేదని, అప్పటి ప్రభుత్వ ధోరణితో ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు వెన్నుదన్నుగా నిలుస్తూ ఏళ్లనాటి సమస్యలను పరిష్కరించి వారి జీవన స్థితిగతులు మారుస్తోందన్నారు. జిల్లా కేంద్రాలైన ములుగు, పెద్దపల్లి పట్టణాల్లో బస్ డిపోలను ఏర్పాటు చేశామన్నారు.

'నాటిన మొక్కలను సంరక్షించాలి'



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నషా ముక్త్ భారత్ వారం రోజుల కార్యక్రమాల్లో భాగంగా కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం కలెక్టర్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నషా ముక్త్ భారత్‌లో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యత



పల్లెలమడుగు తండాలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభిస్తున్న డీఈవో రాజు

గాంధారి(ఎల్లారెడ్డి): మారుమూల గ్రామాల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని పల్లెల మడుగు తండాలో మంగళవారం ఎంఈవో శ్రీహరితో కలిసి డీఈవో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా తండావాసులు డీఈవో రాజు, ఎంఈవో శ్రీహరిలను సన్మానించారు.

వన మహోత్సవం లక్ష్యాలను సాధించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డీఎఫ్‌వో నిఖిత, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్

- అటవీ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు నాటాలి
- వీసీలో అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ

కామారెడ్డి క్రైం : వన మహోత్సవం లక్ష్యాలను సాధించాలని అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ సూచించారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి హైదరాబాద్ నుంచి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ వన మహోత్సవం నిర్వహించాలన్నారు. రోజూ ఒక శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటాలన్నారు. అటవీ ప్రాంతాల్లో కోతులకు అవసరమైన పండ్ల మొక్కలను పెంచాలన్నారు. ఆగస్టు 15 లోగా భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ రామకృష్ణారావు ఆదేశించారు. భారీ వర్షాలు కురవకముందే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు బేస్‌మెంట్ స్థాయి వరకు పూర్తయ్యేలా చూడాలన్నారు. పీఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 కింద ప్రతి పట్టణంలో కనీసం 500 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కలెక్టర్‌లకు సూచించారు. ఆయిల్‌పాం పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు.

32,592 దరఖాస్తులు..

భూ భారతి రెవెన్యూ సదస్సులలో జిల్లాలో 32,592 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. వాటిలో 27,223 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచామన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి 7,269 నోటీసులు జారీ చేశామన్నారు. ఆయా దరఖాస్తులను వేగంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీసీలో డీఎఫ్‌వో నిఖిత, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, హౌసింగ్ పీడీ జ్యోతి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఆర్డీవో సురేందర్ పాల్గొన్నారు.

కలిసి పోరాడితేనే డ్రైపోర్టు సాధ్యం

- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్దాం
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో కేంద్రమంత్రి అమిత్‌షాను కలుద్దాం
- జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటైతే రూ.వెయ్యి కోట్ల ఎకానమీ
- విలువ ఆధారిత పంట ఉత్పత్తులతో రైతులే ఎగుమతిదారులవుతారు
- 'సాక్షి' చర్చ వేదికలో వక్తల అభిప్రాయాలు
- పాల్గొన్న చాంబర్ ఆఫ్ కామర్స్, రైతు ఉత్పత్తిదారుల సంస్థల బాధ్యులు
- జేఏసీ ఏర్పాటుకు తీర్మానం



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న నల్ల దినేష్‌రెడ్డి, పాల్గొన్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

నిజామాబాద్‌లీగల్/డొంకేశ్వర్: జిల్లాలో డ్రైపోర్టు సాధించేందుకు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదామని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బాధ్యులు, ఇతర సంఘాల ప్రతినిధులు నిర్ణయించారు. ఇందుకోసం ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసుకుని ముందుకు వెళ్లేందుకు తీర్మానం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 29న కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్‌షాను కలిసి విన్నవించేందుకు సిద్ధమయ్యారు. తర్వాత ఢిల్లీ వెళ్లి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ప్రకాష్ హ్యుందయ్ షోరూంలో నిజామాబాద్ జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటు కోరుతూ చర్చ వేదిక జరిగింది. నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల్లో పండుతున్న పసుపు, ధాన్యం, సోయా, మొక్కజొన్న, ఎర్రజొన్న, పత్తి, మామిడి పంటలకు అదనపు విలువ జోడించడంతో పాటు సిరిసిల్ల జిల్లాల్లో నేతన్నల ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు నేరుగా ఎగుమతి చేసేందుకు డ్రైపోర్టుతో అవకాశం కలుగుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. పైగా ఈ ప్రాంతంలో రూ. వెయ్యి కోట్ల ఎకానమీ సాధ్యమవుతుందన్నారు. అన్నిరంగాల్లో వివిధ యూనిట్లు ఏర్పాటై యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. డ్రైపోర్టు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు కచ్చితమైన కార్యాచరణ రూపొందించుకుని ముందుకెళ్లాలని తీర్మానం చేశారు. చర్చ వేదిక సమన్వయకర్తగా సాక్షి బ్యూరో ఇన్‌చార్జి తుమాటి భద్రారెడ్డి వ్యవహరించారు.

రైతులే తమ ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవచ్చు



వ్యవసాయ ఉత్పత్తుల్లో దేశంలోనే పేరుగాంచిన ఇందూరు జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటైతే రైతులే ఎగుమతిదారులుగా తయారవుతారు. దేశంలోనే భారీ పసుపు మార్కెట్లలో నిజామాబాద్ మొదటి వరుసలో ఉంది. పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించకుండా వచ్చిన వెంటనే అమ్మేస్తే రైతులకు ఆశించిన ధర దక్కడం లేదు. ఈ క్రమంలో జక్రాన్‌పల్లి మండలంలో ఐదు గ్రామా ల రైతులం కలిసి తెలంగాణలోనే మొదటి పసుపు క్లస్టర్‌ను ఏర్పాటు చేశాం. రైతులు పండించిన పంటతో ఆర్గానిక్ పసుపు పౌడర్‌ను తయారుచేసి విక్రయిస్తున్నాం. డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే రైతులకు మరింత మేలు చేకూరుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు యువతకు మరిన్ని అవకాశాలు సృష్టించబడతాయి. గల్ఫ్ దేశాలకు వెళ్లి పనిచేసే అవసరం ఉండదు. ఆత్మనిర్భర్ భారత్ కింద జిల్లాకు డ్రైపోర్టును సాధించుకోవాలి. అందరం కలిసి పిడికిలి బిగిస్తేనే డ్రైపోర్టు కల సాకారమవుతుంది. ఎంపీ అర్వింద్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌లను కలుద్దాం.

– పాట్కూరి తిరుపతిరెడ్డి, పసుపు ఎఫ్‌పీవో చైర్మన్

డ్రైపోర్టుకు అన్నివిధాలుగా అనుకూలం



డ్రైపోర్టు ఏర్పాటుకు నిజామాబాద్ జిల్లా అన్ని విధాలుగా అనుకూలంగా ఉంది. గతంలో జిల్లాలో 85 వేల ఎకరాల్లో పసుపు, 45 వేల ఎకరాల్లో చెరుకు సాగయ్యేది. తగిన మార్కెటింగ్ వ్యవస్థ, ఎగుమతులకు అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో పసుపు సాగు తగ్గిపోగా, చెరుకు సాగు లేకుండా పోయింది. అన్ని వ్యాపారాలు దెబ్బతిన్నాయి. నాణ్యమైన పంటలు పండించే రైతులున్న జిల్లాలో డ్రైపోర్టు అత్యవసరం. జిల్లా కేంద్రంగా చుట్టుపక్కల జిల్లాల నుంచి పంట, ఇతర ఉత్పత్తులు ఎగుమతి చేసుకోవచ్చు. పంట ఉత్పత్తులు నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు ఎగుమతి చేసుకోవచ్చు. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. డ్రైపోర్టు కోసం గతంలో కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డిలను కలిసి వివరించినా ఫలితం లేదు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెద్దాం. సంకల్ప బలంతో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలి. డ్రైపోర్టు ఏ ఒక్కరి కోసమో కాదు, ముందు తరాల భవిష్యత్తు కోసం..

– నల్ల దినేష్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు

కంటెయినర్ డిపో ఏర్పాటు చేయాలి



జిల్లాలో డ్రైపోర్టు, కంటెయినర్ డిపో ఏర్పాటు చేస్తే జిల్లాలో అభివృద్ధి వేగవంతమవుతుంది. దీని కోసం ఆరేళ్లుగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాం. జిల్లాలో బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్ పోరాటం చేసి సాధించింది. ప్రస్తుతం బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమిద్దాం.

– జగదీశ్వర్‌రావు, అధ్యక్షులు, నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్

అన్ని పార్టీలు మద్దతు తెలపాలి



ఇందూరులో డ్రైపోర్ట్ ఏర్పాటు కోసం చాంబర్ ఆఫ్ కామర్స్ చేస్తున్న పోరాటానికి రాజకీయా లు అతీతంగా మద్దతు తెలపాల్సి ఉంది. దీని సాధన కోసం తెలంగాణ ఉద్య మం స్ఫూర్తిగా ముందుకెళదాం. డ్రైపోర్ట్ ఏర్పాటైతే జిల్లా అభివృద్ధికి టర్నింగ్ పాయింట్ అవుతుంది.

– రాజశేఖర్‌రెడ్డి, రియల్ ఎస్టేట్ వ్యాపారి

సాక్షి డిబెట్

చదివింది పీజీ.. చేస్తోంది పారిశుధ్య పని

- తండ్రి స్థానంలో పారిశుధ్య కార్మికురాలిగా..
- చదువుకు తగ్గ ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్న శ్యామల



మురికి కాలువ శుభ్రం చేస్తున్న శ్యామల

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఆమె ఉన్నత విద్యావంతురాలు.. పీజీ, బీఈడీ పూర్తి చేసింది. తండ్రి పారిశుధ్య కార్మికుడు.. ఆయన అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ పోషణకు కూతురు ఆ పనిలో చేరింది. ఉన్నత విద్యనభ్యసించిన ఆమె ప్రస్తుతం పారిశుధ్య పనులు చేస్తోంది. వివరాలిలా ఉన్నాయి.

కామారెడ్డి బల్దియా పరిధిలోని దేవునిపల్లికి చెందిన శ్యామల దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. కామారెడ్డిలోనే ఇంటర్, డిగ్రీ పూర్తి చేసింది. తర్వాత పీజీ, బీఈడీ కూడా చదివింది. శ్యామల తండ్రి నాగయ్య మూడు దశాబ్దాల పాటు పారిశుధ్య కార్మికుడిగా పనిచేశాడు. ఆయన అనారోగ్యానికి గురవగా.. 2021లో ఆయన స్థానంలో శ్యామలను కాంట్రాక్టు కార్మికురాలిగా ఉద్యోగంలో చేర్చుకున్నారు. కొద్దిరోజులకే శ్యామల తండ్రి నాగయ్య చనిపోయాడు. కాగా పీజీతో పాటు బీఈడీ చదివిన శ్యామల పారిశుధ్య కార్మికురాలిగా పనిచేయడానికి అనేక ఇబ్బందులు పడుతోంది. మురికి కాలువలు శుభ్రం చేయడం, రోడ్లు ఊడ్చడం, గడ్డి తీయడం వంటి పనులన్నీ చేయాల్సి ఉంటుంది. అప్పట్లో మున్సిపల్ మంత్రిని, ఉన్నతాధికారులను కలిసి తన చదువుకు తగ్గ ఉద్యోగం ఇప్పించాలని వేడుకుంది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. మురికి కాలువలు శుభ్రం చేయడం మూలంగా ఆరోగ్యం కూడా దెబ్బతిందని శ్యామల ఆవేదన వ్యక్తం చేస్తోంది. తన చదువును చూసి మున్సిపాలిటీలో ఏదైనా రాత పని ఇప్పించాలని వేడుకుంటోంది.

క్లుప్తంగా

పలు అభివృద్ధి పనుల ప్రారంభం



భిక్కనూరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు పలు కుల సంఘాలకు దేవాలయాలకు సొంత డబ్బులు వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రారంభించారు. మంగళవారం రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్, మోటాట్‌పల్లి, మల్లుపల్లి, బాగిర్తిపల్లి, ఈసన్నపల్లి, పెద్దమల్లా రెడ్డి, కంచర్ల గ్రామాల్లో ఆయన పర్యటించి పనులను ప్రారంభించారు. ఆయన వెంట భిక్కనూరు మండల బీజేపీ ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, మండలాధ్యక్షుడు రమేష్, నేతలు రమేష్ రెడ్డి, గణేష్‌రెడ్డి, బస్వారెడ్డి, నరేందర్‌రెడ్డి, బాల్ లింగం, ఏక్‌నాథ్, విలాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నియామకపత్రం అందుకున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి

కామారెడ్డి టౌన్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ మేరకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

బాన్సువాడ రూరల్: కొల్లూర్ గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మంగళవారం బాన్సువాడ– బీర్కూర్ ప్రధాన రహదారిపై కాసేపు రాస్తారోకో చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు అధిక ధరలకు ఇసుక వేస్తుండటంతో భారం అవుతోందని వారు ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు అటు ట్రాక్టర్ ఓనర్లకు ఇటు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నష్టం కలుగకుండా దూరాన్ని బట్టి ఒక్కో గ్రామానికి ధరను నిర్ణయించారు. కొల్లూర్ గ్రామానికి రూ.1,600 ట్రాక్టర్ ఇసుక పోయాల్సి ఉండగా రూ.2,400 చెల్లించాలని ట్రాక్టర్ ఓనర్లు డిమాండ్ చేశారు. దీంతో తమ గ్రామం మీదుగా ఇసుక ట్రాక్టర్లను వెళ్లనీమంటూ అడ్డుకున్నారు. విషయం తెల్సుకున్న ప్రజాప్రతినిధులు, యూనియన్ నాయకులు చర్చలు జరిపి న్యాయమైన ధరకు ఇసుక సరఫరా చేయాలని నిర్ణయించారు.

ఉపాధి అవకాశాలుండే విద్య అవసరం



జాతీయ సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి తదితరులు



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, పత్ర సమర్పకులు

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి
- తెయూలో 'వికసిత్ భారత్–2047' జాతీయ సదస్సు

తెయూ(డిచ్‌పల్లి): స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్‌తోపాటు ఉపాధి అవకాశాలుండే విద్య అవసరమని, అలాంటి విద్యా విధానం అమలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం, తెలంగాణ కామర్స్ అసోసియేషన్ (టీసీఏ) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజ్ సెమినార్ హాల్‌లో 'వికసిత్ భారత్–2047, ట్రాన్స్‌ఫార్మటివ్ రోల్ అఫ్ కామర్స్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ద్వారా సరైన మార్గదర్శనం చేయడానికి యూనివర్సిటీలు కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా చూస్తున్నారని, ఆయన ఆశయాలను మనం అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన విద్య ఉన్న వారికి సముద్ర అంతర్భాగాల నుంచి ఆకాశం వరకు అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రపంచంతో పోటీపడే విద్యతోనే వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. తెయూ వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్యంతో కో–ఆపరేటివ్ ఫెడరలిజం వల్ల అవినీతి తగ్గి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సదస్సు కార్యదర్శి రాంబాబు గోపిశెట్టి మాట్లాడుతూ.. జాతీయ సదస్సులో మానవ వనరుల నిర్వహణ, అకౌంటింగ్, ఆర్థికం, మార్కెటింగ్, పన్నులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చెయిన్, బిగ్ డేటా, ఆటోమేషన్‌పై పరిశోధకులు, విద్యావేత్తలు, వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి విచ్చేసి పత్ర సమర్పణ చేసినట్లు తెలిపారు. విదేశాల నుంచి 4, భారత్‌లోని 8 రాష్ట్రాల నుంచి 174 పత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపీఈ) డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, తెలంగాణ కామర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పురుషోత్తమరావు, అధ్యక్షుడు చెన్నప్ప, జనరల్ సెక్రెటరీ రవికుమార్ జాస్తి, రిజిస్ట్రార్ యాదగిరి ప్రసంగించారు. అనంతరం సదస్సులో 'వికసిత్ భారత్–2047, ట్రాన్స్‌ఫార్మటివ్ రోల్ అఫ్ కామర్స్' సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, సదస్సు కన్వీనర్ శ్రీనివాస్, కో కన్వీనర్లు గంగాధర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల మంజూరుకు కృషి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు అన్ని రకాల వసతులు ఉన్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కళాశాల మంజూరుకు కృషి చేస్తానని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. తెయూలో జరిగిన జాతీయ సదస్సుకు హాజరైన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు తగిన సౌకర్యాలు, ఫ్యాకల్టీ ఉందన్నారు. ఈమేరకు వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరిలతో కలిసి తాను క్యాంపస్‌లోని భవనాలను, వసతి సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే యూజీసీ ఆదేశాల ప్రకారం ఈ విద్యాసంవత్సరం నుంచి అన్ని యూజీ, పీజీ కళాశాలల్లో 20 శాతం స్కిల్ బేస్డ్ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఇతర టెక్నికల్ కోర్సులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి స్కిల్ (నైపుణ్యం) అత్యంత అవసరమని, ఫస్ట్ లాంగ్వేజ్, సెకండ్ లాంగ్వేజ్ ఉన్నట్లే థర్డ్ లాంగ్వేజ్ ఇకనుంచి స్కిల్ కోర్సులు ఉండాలని ఆయన వివరించారు. అలాగే కళాశాలలు కంపెనీలతో ఎంఓయూ చేసుకుని ఉపాధి అవకాశాలు సృష్టించాలన్నారు. సిలబస్‌లో మార్పులు చేస్తున్నామని, ఇందుకు వేర్వేరు రెగ్యులేటరీ కమిటీలు అనుమతులు అవసరమన్నారు. త్వరలోనే అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల ఖాళీలను గుర్తించి రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానీపేట తండా పాఠశాల స్థలంలో చేపట్టిన అక్రమ కట్టడాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేసి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. పాల్వంచ తహసీల్దార్ హిమబిందు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన గుగులోతు జమున, బానోత్ పింటు పాఠశాల స్థలాన్ని ఆక్రమించి బాత్రూమ్, ప్రహరీలు నిర్మించుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం రమ్య ఫిర్యాదు మేరకు అక్రమార్కులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులను ఖాతరు చేయకపోవడంతో మాచారెడ్డి ఎస్సై అనిల్, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సిబ్బందితో వెళ్లి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారని తహసీల్దార్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరేపల్లి సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సహాయ వంట మనిషిగా పనిచేయుటకు మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారిణి మైసకళ మంగళవారం తెలిపారు. ఆసక్తిగల వారు 26న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు దరఖాస్తులతో పాఠశాలకు రావల్సిందిగా ఆమె కోరారు.

చరిత్రకు సాక్షిగా నిలిచిన శివాలయం

మీకు తెలుసా?



ఆలయంలోని శివలింగం



బోధన్‌లోని ఏకచక్రేశ్వర శివాలయం

పట్టణంలోని అపురూపమైన ఏకచక్రేశ్వర శివాలయం చరిత్రకు సాక్షిగా నిలుస్తోంది. భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తూ జిల్లాలోనే విశిష్టత కలిగిన ఆలయంగా ప్రసిద్ధి చెందింది.

- 13వ శతాబ్దంలో కాకతీయులు బోధన్ ప్రాంతాన్ని పాలించిన కాలంలో ఈ ఆలయాన్ని నిర్మాణం చేసినట్లు శివలీలామృతం అనే ప్రాచీన సంస్కృత గ్రంథంలో పేర్కొనబడింది.
- కాకతీయ పాలనలో ముష్కరులు దక్షిణ భారతదేశ దండయాత్రకు పూనుకున్న సమయంలో ఆలయాన్ని రక్షించుకునేందుకు ఈ ప్రాంతం వారు మట్టితో ఆలయాన్ని కప్పివేసి ఉంటారని ప్రచారంలో ఉంది.
- 1959లో గుంటూరు వాస్తవ్యుడైన రామిరెడ్డి అనే వ్యక్తి బోధన్‌లో స్థిరపడటానికి ఒక మట్టి కోటను చదును చేస్తుండగా (పుష్య బహుళ అమావాస్య రోజు) ఈ ఆలయం బయల్పడినట్లు బోధన్ పూర్వీకులు చెబుతుంటారు.
- సముద్రంలో అరుదుగా లభించే ప్రత్యేకమైన సాలాగ్రామము శిలతో చేయబడిన శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠాపన చేయడం అత్యంత విశేషమైనది.
- ఆలయంలోని శివలింగానికి నిత్యం పూజలు చేసేవారికీ ధనధాన్యాలకు లోటు ఉండదని శివపురాణంలో ప్రత్యేకంగా చెప్పబడింది. అందుకు తగ్గట్టుగానే ఈ ప్రాంతంలో ప్రజలకు తిండికి, నీటికి కొదవుండదు.
- ఆలయ అభివృద్ధి కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో శివరాత్రి, కార్తీకమాసం, శ్రావణ మాసంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలతో పాటు, భక్తులకు ప్రత్యేక వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– బోధన్‌రూరల్

'డబుల్' ఇళ్ల బిల్లులు నొక్కేశారు

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



పత్రాలు చూపుతున్న లబ్ధిదారులు

బిచ్కుంద(జుక్కల్): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయని, అధికారులు, నాయకులు, కాంట్రాక్టర్ చేతివాటం ప్రదర్శించి లబ్ధిదారులకు తెలియకుండా బిల్లులు నొక్కేశారని ఆరోపిస్తూ మంగళవారం బాన్సువాడలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, బిచ్కుందలో ఎంపీడీవో గోపాల్‌కు లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. '2023 సెప్టెంబర్‌లో గోపన్‌పల్లిలో కొట్టె పుష్పలత, సందుల గంగవ్వ, నీరుడి నాగమణి, ఎం. సురేఖ, ఖాజాబీ, వడ్ల గీత, పొట్టి భూమవ్వ, శెట్పల్లి లక్ష్మి, నాయని శోభలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. అప్పట్లో మద్నూర్ మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఇళ్ల నిర్మాణ ం కోసం పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్ వరకు కట్టి వెళ్లిపోయాడు. ఎన్నికలు ముగిశాక పనులు చేయలేదు. లబ్ధిదారులు సొంత డబ్బులతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నారు. బిల్లులు వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్నారు. అప్పట్లో పంచాయతిరాజ్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై మాకు తెలియకుండానే రూ.3 లోలు బిల్లులు నొక్కేశారు' అని ఆరోపించారు. అప్పటి గృహలక్ష్మి పథకం జాబితాలో పరిశీలిస్తే ఇళ్ల నిర్మాణం పూర్తయింది.. రూ.3 లక్షల చెల్లించినట్లు జాబితాలో ఉందన్నారు. విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.

ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా వీణ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా వీణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న వీణ ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా బాధ్యతలు తీసుకున్నారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఇన్‌చార్జి ఆర్డీవోగా ఉండడంతో ఆమె స్థానంలో కామారెడ్డి ఆర్డీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

సంక్షిప్తం

మంత్రికి ఘన స్వాగతం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవానికి వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో నాగిరెడ్డిపేట కాంగ్రెస్ నాయకులు పోచారం గ్రామం వద్ద ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. మాల్తుమ్మెద సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్ రెడ్డి, నాగిరెడ్డిపేట మాజీసర్పంచ్ విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని ఏద మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యూనికార్పస్ ఫౌండేషన్, ఇండియా మెడికల్ మిషన్ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో ఉచితంగా కంటి, రక్త, దంత పరీక్షలు చేసి మందులను అందించారు. నిర్వాహకులు లీనాహెప్సీబీ, శ్రీనివాసాచారి, ఏఎంసీ చైర్మన్ రజితారెడ్డి, కుడుముల సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, సామెల్ తదితరులున్నారు.

జాతీయ ఆహార భద్రత సదస్సులో జిల్లా అధికారి



కామారెడ్డి టౌన్: భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో జాతీయ సదస్సులు జరుగుతున్నాయి. కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో ఈనెల 23న ప్రారంభమైన ఐదు రోజుల సదస్సులో జిల్లా ఆహార భద్రత, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి శిరీష పాల్గొన్నారు. వికారాబాద్, మెదక్, యాదాద్రి, ఆదిలాబాద్ జిల్లాల ఆహార భద్రత అధికారులతో కలిసి ఈ సదస్సులో పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. ఆహార భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమ నిబంధనలు, సాంకేతిక పరిజ్ఞానం అమలు నైపుణ్యాలు, నియంత్రణ సామర్థ్యాలను మెరుగుపర్చడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాచారెడ్డి: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మాచారెడ్డి హెడ్‌కానిస్టేబుల్ షౌకత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు కళాజాత బృందం అవగాహన కల్పించింది. కళాజాత బృందం సభ్యులు తిరుపతి, రమేష్, హెచ్‌ఎం వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



కామారెడ్డి క్రైం: ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామస్తులు మంగళవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. అచ్చంపేట శివారులో ఉన్న నవోదయ వెనుక ప్రాంతంలో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ ప్రజాప్రతినిధి కబ్జా చేశారని ఆరోపించారు. అదే కాకుండా మరి కొన్ని చోట్ల కూ డా భూములు కబ్జాకు గురవుతున్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాంసం విక్రయదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని పేర్కొంటూ నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేట పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య స్థానిక మాంసం విక్రయదారులకు మంగళవారం నోటీసులను అందజేశారు. ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా మాంసం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు చేపడతామని చెప్పారు. ఆయనవెంట జీపీ సిబ్బంది కార్తీక్ ఉన్నారు.

జీపీ భవనానికి భూమిపూజ

ఎల్లారెడ్డిరూరల్: మీసాన్‌పల్లిలో నూతనంగా నిర్మించనున్న జీపీ భవనానికి కాంగ్రెస్ నాయకులు మంగళవారం భూమిపూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, కుడుముల సత్యనారాయణ, సామెల్, వెంకట్రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా, డీఎల్‌పీవో సురేందర్, ఎంపీడీవో ప్రకాష్ తదితరులున్నారు.

వ్యాసరచన పోటీలు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై మంగళవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ఎంఈవో రాజులు అందించారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

వర్ని: మండలంలోని జాకోరా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వర్ని ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కమ్మరి సతీష్ (40) ఫొటో గ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున అతడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే సతీష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లింగంపేట మండలంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మున్నూరుపల్లి సాయిలు–అనసూజ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. కొడుకు మున్నూరుపల్లి అశోక్(22) ఇంటర్ వరకు చదివి, గొర్లను కాస్తున్నాడు. కొంత కాలంగా దుబాయి వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పగా వారు వద్దని వారించారు. పెళ్లి చేసుకొమ్మని చెప్పగా తర్వాత చేసుకుంటానన్నాడు. మనస్తాపం చెందిన అశోక్ మంగళవారం ఉదయం తెల్లవారుజామున దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. లింగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖతార్‌లో ఆర్మూర్‌వాసి అదృశ్యం

ఆర్మూర్: పట్టణంలోని కాశీ హనుమాన్ గల్లీకి చెందిన కా నూర్ నాగరాజు ఖతార్‌లో అ దృశ్యం అయ్యాడని బాధిత కుటుంబ సభ్యులు తెలిపా రు. అతడి ఆచూకీ కనుగొనా లని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణి లో తండ్రి కానూర్ నారాయణ వినతిపత్రం సమ ర్పించారు. ఆరు నెలల క్రితం నాగరాజు ఖతార్‌కు వెళ్లి విధుల్లో చేరాడని, గత నెల 26 నుంచి ఫోన్‌లో అందుబాటులో లేడని అతడి తండ్రి ఆందోళన వ్య క్తం చేశారు. ఏదో క్రిమినల్ కేసు విచారణ కోసం పో లీసుల అదుపులో ఉన్నట్లు అనుమానంగా ఉందంటూ సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్మూ ర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, తెలంగాణ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి చొరవ చూపాలని వారికి అభ్యర్థనలు పంపారు. ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌ను సందర్శించిన జీఏడీ ఎన్నారై విభాగం అధికారులు శ్రీనివాసరెడ్డి, చిట్టిబాబులకు నారాయణ తన గోడును వెళ్లబోసుకున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భిక్కనూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. భిక్కనూరు ఎస్సై అంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన చెట్లపల్లి రవి (42) ఈనెల 14న తాటికొండ అశోక్ అనే వ్యక్తికి జ్వరం రావడంతో చికిత్స కోసం అతడిని బైక్‌పై ఎక్కించుకొని భిక్కనూరు ప్రభుత్వాస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో వారి బైక్‌ను కామారెడ్డి వైపు నుంచి భిక్కనూరుకు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రవికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం అతడిని హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ రవి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సర్వర్ డౌన్.. నిలిచిన రిజిస్ట్రేషన్లు



లింగంపేట తహసీల్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

లింగంపేట(ఎల్లారెడ్డి): సర్వర్ డౌన్‌తో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దాంతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి వచ్చిన రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తహసీల్ కార్యాలయం వద్ద నిరీక్షించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. భూభారతి చట్టం అమలు కోసం లింగంపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా రెండు నెలల పాటు రిజిస్ట్రేషన్లు అధికారులు నిలిపివేశారు. జూన్ 3 నుంచి తిరిగి రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు.

గత 15 రోజులుగా ఆన్‌లైన్‌లో అంతరాయం ఏర్పడుతుండడంతో రైతులు ప్రతి రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ డౌన్ కారణంగా రోజుకు 4 నుంచి 10 వరకు రిజిస్ట్రేషన్లు అవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయమై తహసిల్దార్‌ను వివరణ కోరగా.. రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ డౌన్ సమస్య ఉందన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి



సాయికృష్ణను నిలదీస్తున్న ఉపాధ్యాయులు

కామారెడ్డి టౌన్: విద్యార్థులను మందలించినందుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి చేసి చితకబాదిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ హనుమాన్ మందిర్ పాఠశాలలో జరిగింది. వివరాలు ఇలా.. హనుమాన్ మందిర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 21న 5వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు బయటకు వెళ్లి, కొద్దిసేపటికి తిరిగి వచ్చారు. దీంతో వారిని ఉపాధ్యాయుడు బాలకృష్ణ మందలించాడు. పాఠశాల ముగిసిన తర్వాత ఓ బాలిక ఈ విషయాన్ని ఆమె తండ్రి ఓ విద్యార్థి సంఘ నాయకుడు వడ్ల సాయి కృష్ణతో చెప్పింది. దీంతో వడ్ల సాయి కృష్ణ మంగళవారం ఉదయం పాఠశాలకు చేరుకుని బాలకృష్ణపై దుర్భాషలాడుతూ చితకబాదాడు. అనంతరం సదరు ఉపాధ్యాయుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు కామారెడ్డి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తనపై అకారణంగా దాడి చేసిన సాయికృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయుడు బాలకృష్ణ కోరారు. తన కూతురుని ఉపాధ్యాయుడు బెదిరించాడని సాయికృష్ణ తెలిపారు. ఘటనపై ఎంఈవో ఎల్లయ్య విచారణ జరిపి డీఈవోకు తెలిపారు.